క్లుప్తంగా

ఓటర్ల జాబితా ప్రదర్శన



కొప్పెర్ల సచివాలయం వద్ద ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న కార్యదర్శి, సిబ్బంది

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల పంచాయతీ ఓటర్ల జాబితాను సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ఉమాశంకర్‌తో పాటు సిబ్బంది సోమవారం ప్రదర్శించారు. పంచాయతీ సర్పంచ్ పైడి వెంకటరమణ మృతి చెందడంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించేందుకు సచివాలయం వద్ద ఓటర్ల జాబితా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో...

డెంకాడ: మండలంలోని సింగవరం ఎంపీటీసీ పరిధిలోని సింగవరం, నాతవలసతో పాటు డి.తాళ్లవలస పంచాయతీకి సంబంధించిన ఓటర్ల జాబితాలను ఆయా గ్రామాల్లో అధికారులు విడుదల చేశారు. సింగవరం ఎంపీటీసీ, డి.తాళ్లవలస సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి జాబితాలు రూపొందించారు.

బకాయి జీతాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులకు బకాయి జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ధర్నా చేశారు. కార్మికులకు మూడు నెలలుగా, సెక్యూరిటీ గార్డులకు నాలుగు నెలలుగా కాంట్రాక్టర్ జీతాలు చెల్లించలేదన్నారు. వెంటనే జీతాలు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రంగరాజు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో విజేతలకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విజయ్‌కుమార్

విజయనగరం రూరల్: ఈ నెల 17 నుంచి 19 వరకు విశాఖ జిల్లా భీమిలిలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ప్రథమస్థానం సాధించిన జిల్లా జట్టులో సభ్యులైన జొన్నవలస ఉన్నత పాఠశాల విద్యార్థులను జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు అభినందించారు. సోమవారం పాఠశాలను సందర్శించిన శ్రీనివాసరావు బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమస్థానం సాధించిన జిల్లా జట్టులో సభ్యులైన పాఠశాల విద్యార్థినులు కె.అంజలి, డి.ఉమ.. బాలుర విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన జట్టు సభ్యులు ఎ.యశ్వంత్, డి.యుంగధర్‌లను సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఈపు విజయ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు పి.రామకృష్ణ పాల్గొన్నారు.

మురుగునీటితో ఇక్కట్లు



మండల కేంద్రంలోని వీధి కాలువలో నిలిచిపోయిన మురుగు నీరు

భోగాపురం: మండల కేంద్రంలోని మరడవీధి కాలువలో మురుగునీరు పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కాలువలో పేరుకుపోయిన చెత్తను పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు తీస్తున్నప్పటికీ మురుగు నీరు పారే అవకాశం లేకపోవడంతో దోమలతో అవస్థలు పడుతున్నామని ప్రజలు చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీరు పారేలా కాలువలను వెడల్పు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ ఈఓ రామకృష్ణ వద్ద ప్రస్తావించగా.. ఈ సమస్య ఏళ్ల తరబడి ఉందని, త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో ఎల్లమ్మ తల్లికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పారదర్శక సేవలకు చిరునామా..

- ప్రజలకు సేవలందిస్తున్న సచివాలయాలు
- కార్యాలయాల్లో లబ్ధిదారుల జాబితాల ప్రదర్శన
- సంక్షేమ పథకాలు పొందేందుకు మార్గదర్శకాలు



భోగాపురం సచివాలయంలో గోడలకు అతికించిన ప్రభుత్వ పథకాలు, లబ్ధిదారుల వివరాలు

భోగాపురం: ప్రభుత్వం నుంచి తనకు ఏదైన పథకం మంజూరైందా, లేదా అనేది తెలుసుకోవాలంటే గతంలో లబ్ధిదారుడు ఒక కార్యకర్త వద్దకో లేక నాయకుడు చెంతకు వెళ్లాల్సి వచ్చేది. లేకపోతే గ్రామం నుంచి మండల కేంద్రంలోని సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి వివరాలు తెలుసుకోవాల్సి వచ్చేది. అయితే ఇదంతా గతం. ప్రస్తుతం ప్రజలకు గ్రామ, పట్టణ స్థాయిలో అందుబాటులోకి వచ్చిన సచివాలయాలతో ప్రజల చెంతకే పాలన వచ్చింది. ఆయా సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన నోటీసుబోర్డులను పరిశీలిస్తే చాలు అన్ని వివరాలు తెలుసుకోవచ్చు. ఒకవేళ చదువురాని వారు అయితే సచివాలయాలలో అందుబాటులో ఉండే ఉద్యోగులను అడిగితే చాలు అన్ని వివరాలు చెప్పేస్తున్నారు.

సచివాలయాలకు వెళ్తే చాలు..

సంక్షేమ పథకాల్లో పారదర్శకతకు గ్రామ, వార్డు సచివాలయాలు చిరునామాగా నిలుస్తున్నాయి. లబ్ధిదారుల వివరాలను నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించడమే కాకుండా ప్రజల సందేహాలను నివృత్తి చేసే వేదికలుగా మారుతున్నాయి. ఇప్పటికే మంజూరైన పథకాల లబ్ధిదారుల వివరాలతో పాటు కొత్తగా వస్తున్న సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన సమాచారాన్ని నోటీస్‌బోర్డుల్లో పొందుపరుస్తున్నారు. దరఖాస్తు ఎవరికీ చేసుకోవాలి, గడువు తేదీ, దరఖాస్తు ఫారంతో పాటు సమర్పించాల్సిన పత్రాల వివరాలు వంటి అన్ని రకాల పూర్తి సహకారంతో కూడిన వివరాలను తెలియజేస్తున్నారు.

నియోజకవర్గంలోని సచివాలయాలు.. ఉద్యోగుల వివరాలు		
మండలం	సచివాలయాలు	ఉద్యోగులు
భోగాపురం	16	150
పూసపాటిరేగ	22	190
డెంకాడ	17	149
నెల్లిమర్ల	16	172
మొత్తం	71	661

అలాగే ఆయా సచివాలయాల పరిధిలో ఏడాదిగా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన సమాచారం సైతం గ్రామ సచివాలయాల్లో లభిస్తోంది.

వందల్లో సేవలు..

ఏ పత్రం కావాలన్నా గంటల వ్యవధిలో పొందే అవకాశం సచివాలయాల ఏర్పాటుతో వచ్చింది. గతంలో డబ్బులు ఖర్చు చేసినా రోజుల తరబడి కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం సచివాలయాలు వచ్చాక దాదాపు 500 రకాలకు పైగా సేవలు అందజేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండానే ప్రజలకు అన్ని రకాల సేవలు అందుతున్నాయి. కులం, ఆదాయం, తదితర సర్టిఫికెట్లతో పాటు ఆధార్ సేవలు, పన్ను చెల్లింపులు ఇలా ఎన్నో సేవలతో పాటు పథకాలు కూడా మంజూరు చేస్తున్నారు.

సేవలు అమోఘం



ఏ చిన్న పత్రం కావాలన్నా గతంలో ఆయా ప్రభుత్వ కార్యాలయాల వద్దకు పరిగెత్తాల్సి వచ్చేది. ఆటో ఖర్చుల దగ్గర నుంచి కార్యాలయాల వద్ద పడిగాపులు కాసినా పనులు జరిగే పరిస్థితి లేదు. సచివాలయాలు వచ్చిన తర్వాత వాటి ద్వారా అందే సేవలు అమోఘం. చదువురాని వారికి కూడా సిబ్బంది సహకరిస్తూ ఇక్కడికి వచ్చే వారికి సేవలు అందిస్తున్నారు.

– కొమ్మూరు రాధ, మరడవీధి, భోగాపురం మండలం

ఇబ్బంది లేకుండా సేవలు



ప్రజలకు ఇబ్బంది లేకుండా సచివాలయాల ద్వారా సేవలందిస్తున్నాం. ప్రభుత్వ పథకాల వివరాలు తెలుసుకోవడానికి సమీప సచివాలయానికి వెళ్తే చాలు.. అన్ని సందేహాలు నివృత్తి అవుతాయి. సమయం, డబ్బు వృథా చేసుకుని మండల కేంద్రాలకు వెళ్లనవసరం లేదు. అర్హతలు ఉంటే అన్ని పనులు సకాలంలో అందిస్తారు.

– దాసరి బంగారయ్య, ఎంపీడీఓ, భోగాపురం

నోటీస్‌బోర్డులో సమాచారం



ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో పాటు అన్ని శాఖల టోల్‌ఫ్రీ నంబర్లను సచివాలయ నోటీస్‌బోర్డుల్లో అతికిస్తున్నాం. జిల్లా అధికారుల ఫోన్ నంబర్లు కూడా ఉంచాం. చదువురాని వారు వస్తే సచివాలయ ఉద్యోగులు సమగ్ర సమాచారం అందిస్తున్నారు. వలంటీర్లు కూడా అన్ని విషయాలను ప్రజలకు వివరిస్తున్నారు.

– రామకృష్ణనాయుడు, సచివాలయ సెక్రటరీ భోగాపురం

ఎన్నికల నిబంధనలు అమలు చేయండి

నెల్లిమర్ల: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోనూ నిబంధనలు అమలయ్యేలా చూడాలని వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు తహసీల్దార్ కేవీ రమణ రాజు సోమవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. అనుమతి లేకుండా ఎక్కడైనా బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహిస్తే వెంటనే సమాచారం అందించాలని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అభ్యర్థులు గాని వారి మద్దతుదారులు గాని ప్రచా రం నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు.

పోస్టర్ల తొలగింపు



పోస్టర్లు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లోని పోస్టర్ల ను తొలగించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు, అధికారులు సోమవా రం గ్రామాల్లో పర్యటించారు. మండలంలోని చెల్లూరు, కోరుకొండ గ్రామాల్లో బీఎల్ఓలు, అధికారులకు ఎలక్షన్ కోడ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ బోని సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజును గెలిపించండి



సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- 37వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. నగరంలోని 37వ డివిజన్ వీటీ అగ్రహారం బీసీ కాలనీలో కోలగట్ల, తదితరులు సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యం ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్, డివిజన్ కార్పొరేటర్ కడియాల రామకృష్ణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎన్నికల్లో విజయానికి దోహదపడతాయన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యార్థులకు విద్యాదీవెన, అమ్మఒడి, విదేశీ విద్య లాంటి కార్యక్రమాలు చేపట్టి ఎంతో మందిని పట్టభద్రులుగా తీర్చిదిద్దారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజారంజక పాలన, నియోజకవర్గంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల పనితీరు చూసి ఓటర్లు తప్పకుండా సీతంరాజును గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరందుకున్న విస్తరణ పనులు

- రూ. 6.50 కోట్లతో విజయనగరం – బొడారా రోడ్డు విస్తరణ
- వేగంగా జరుగుతున్న కాలువలు, సెంటర్ డివైడర్ల నిర్మాణాలు
- సోమవారం నుంచి ప్రారంభమైన బీటీ రోడ్ నిర్మాణ పనులు



విజయనగరం-బొడారా రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా వేస్తున్న బీటీ రోడ్డు



రోడ్డు మధ్య భాగంలో ఏర్పాటు చేసిన డివైడర్

విజయనగరం: నగరంలో రోడ్డు విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ జంక్షన్ నుంచి కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ మీదుగా ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వరకు జరుగుతున్న విస్తరణ పనులు త్వరలో పూర్తి చేసే దిశగా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. 1.5 కిలో మీటర్ల పొడవు గల ఈ రోడ్డు ప్రస్తుతం ప్రస్తుతం 30 నుంచి 40 అడుగుల వెడల్పుతో ఉన్న రెండు లేన్ల రోడ్డును 66 అడుగుల వెడల్పుతో నాలుగు లేన్లుగా విస్తరించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించి వదిలేసిన పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేగవంతం చేసింది. రూ.6.50 కోట్లు నిధులు కేటాయించగా... ఇప్పటివరకు రూ.2.70 కోట్ల విలువ చేసే పనులు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే విస్తరణలో భాగంగా ఇళ్లు నష్టపోయిన బాధితులకు పరిహారం పంపిణీ చేయగా... మరో ఆరు భవనాలు తొలగించాల్సి ఉంది.

తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే గూడ్స్‌షెడ్ రోడ్డులో విస్తరణ పనులు పూర్తయితే ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ఈ ప్రాంతంలో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు పక్కనే ఉన్న ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వస్త్ర వ్యాపారులు నిత్యం వస్త్రాలు కొనుగోలు చేసే బాలాజీ టెక్స్‌టైల్ మార్కెట్‌ ఉంది. ప్రతిరోజూ వందల సంఖ్యలో వినియోగదారులు ఈ మార్కెట్‌లో వస్త్రాలు కొనుగోలు చేసుకునేందుకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. విస్తరణ పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్య తీరనుంది.

శర వేగంగా నిర్మాణాలు

నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో భాగంగా చేపడుతున్న విజయనగరం – బొడారా రోడ్డు విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. 1.5 కిలోమీటర్ల వెంబడి చేపడుతున్న పనుల్లో భాగంగా ప్రధాన రహదారికి రెండు వైపులా కాలువ నిర్మాణ పనులు చకా చకా సాగుతున్నాయి. అంతేకాకుండా రోడ్డు మధ్య భాగంలో డివైడర్లు నిర్మిస్తున్నారు.

వేగవంతం..



నగరంలోని విజయనగరం – బొడారా విస్తరణ పనులు వేగవంతం చేశాం. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో భవనాలు తొలగించేందుకు యజమానులు సైతం సహకరిస్తున్నారు. రూ.6.50 కోట్లతో చేపట్టిన పనుల్లో భాగంగా ఇప్పటివరకు రూ. 2.70 కోట్ల పనులు పూర్తయ్యాయి. ఇళ్లు కోల్పోయిన వారికి దశల వారీగా బిల్లులు మంజూరు చేస్తున్నాం. జూన్ నెలాఖరు లోగా పనులు పూర్తి చేస్తాం.

– టి.శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ డీఈఈ, విజయనగరం

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు

- పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రాజారావు

విజయనగరం: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నగరంలో ప్రజలకు ఎటువంటి నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రాజారావు అన్నారు. ఇందులో భాగంగానే ముషిడిపల్లి, రామతీర్థం, నెల్లిమర్ల, కుదిపి అమృత వాటర్ హెడ్స్ పంప్‌హౌస్‌లను సోమవారం పరిశీలించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవిలో నీరు తగ్గకుండా ఉండేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు తెలిపారు. ముషిడిపల్లి, నెల్లిమర్ల ప్రాజెక్టుల వద్ద కవారం రోజుల్లో క్రాస్‌బాండ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్ఈ వెంట మున్సిపల్ ఇంజినీర్ శ్రీనివాసరావు, డీఈ అప్పారావు ఉన్నారు.

ఉన్నత భవిష్యత్ లక్ష్యంగా కోర్సులు

- జేఎన్‌టీయూ జీవీ వీసీ వెంకటసుబ్బయ్య



మాట్లాడుతున్న జెఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: ప్రతి విద్యార్థికీ ఉన్నత భవిష్యత్ కల్పించే దిశగా అత్యాధునిక కోర్సులు రూపొందిస్తున్నట్లు జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీ కె. వెంకటసుబ్బయ్య అన్నారు. యూనివర్సిటీ సమావేశ మందిరంలో యూనివర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్తమ బోధనే యూనివర్సిటీ లక్ష్యమన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో కొత్త విధి విధానాలు రూపొందిస్తామన్నారు. కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్, స్కిల్ బేస్డ్ ఇంటర్న్‌షిప్‌లో విద్యార్థుల సామర్థ్యం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె..శ్రీకుమార్, వివిధ ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఆర్‌కే డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

విజయనగరం అర్బన్: పట్టణంలోని ఆర్‌కే డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. 2017 నుంచి 2022 వరకు బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్ పూర్తి చేసిన వారికి హెచ్‌సీఎల్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి పలువురికి నెట్‌వర్క్ ఎనలిస్ట్/డేటా ఎనలిస్ట్, తదితర ఉద్యోగాలు కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సృజన, కరస్పాండెంట్ కోలా సంతోష్, డైరెక్టర్ అంజనా, తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు చేయూత



భోజనం చేస్తున్న అంధ విద్యార్థులు

విజయనగరం: అంధ విద్యార్థులకు పెద్ద మనసుతో ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని విశాఖ పట్టణానికి చెందిన వైశాఖి దివ్యాంగ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం. శ్రీమన్నారాయణ విజ్ఞప్తి చేశారు. విజయనగరం పట్టణంలోని వైష్ణవ వీధిలో ఉన్న పేర్ల వారి చెవిటి, మూగ పాఠశాల విద్యార్థులకు చారిటబుల్ ట్రస్ట్ తరఫున సోమవారం క్రీడాదుస్తులు, పరికరాలు అందజేయడంతో పాటు భోజనం సమకూర్చారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, వైకల్యంతో కొట్టుమిట్టాడుతున్న విద్యార్థులకు చేయూతనందించాలన్న ఉద్దేశంతో తమ సంస్థ ప్రతినెలా విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని వికలాంగ పాఠశాలలకు వెళ్లి వారికి భోజనంతో పాటు అవసరమైన పరికరాలు సమకూరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి సోమేశ్వరరావు, కోశాధికారి కేవెల్ నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన డీఈఓ



కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విజయనగరం పూల్‌బాగ్: పట్టణంలోని బాబామెట్టలో గల కేజీబీవీని జిల్లా విద్యాశాఖాధికారి బి. లింగేశ్వరరెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధన కోసం ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్టీ బ్యాచ్ విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత, డీఈఓ కార్యాలయ సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే కేంద్రీయ విద్యాలయాన్ని కూడా సందర్శించారు.

మనవ మేధస్సుకు ప్రతిరూపమే సైన్స్



మాట్లాడుతున్న ఫిజిక్స్ అధ్యాపకుడు చంద్రశేఖర్

విజయనగరం పూల్‌బాగ్: మానవుడి మేధస్సుకు ప్రతిరూపమే సైన్స్ అని.. సైన్స్ ఎల్లప్పుడూ భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో ఒకేలా ఉంటుందని రాజాం డిగ్రీ కళాశాల ఫిజిక్స్ అధ్యాపకుడు జోగా చంద్రశేఖర్ అన్నారు. ఫిబ్రవరి 28 సైన్స్ దినోత్సవం, జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక బాబామెట్టలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎ. ఆనంద్, పట్టణ అధ్యక్షుడు ఎస్. శివాజీ, జి. అప్పలనాయుడు, జి. లక్ష్మణరావు, పి. రమేష్, పి. షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

సంబరం ఆరంభం...

- వేడుకగా ఎల్లమాంబ తొలేళ్ల ఉత్సవం
- నేడు సిరుల ఉత్సవం



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో భక్తులు (ఇన్‌సెట్లో) ఎల్లమ్మ తల్లి పుట్ట

విజయనగరం టౌన్: అమ్మ దర్శనానికి భక్తులు బారులు తీరారు. సోమవారం ఉదయం 4 గంటల నుంచే రంజనీ థియేటర్ వద్దనున్న ఎల్లమాంబ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తొలేళ్ల సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉన్న ఎల్లమ్మతల్లి పుట్టను భక్తులు దర్శించుకుని పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు మంచినీరు, మజ్జిగ, చిన్నారులకు పాలు, బిస్కెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సేవకులు వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. సాయంత్రం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకి చెందిన వెంకట శివసాయి బృందం నిర్వహించిన సీతారామ కల్యాణం బుర్రకథ చూపరులను ఆద్యంతం భక్తిభావంలో ముంచెత్తింది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు చందక అప్పారావు, రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సిరిమానోత్సవం

ఎల్లమ్మ సిరిమానోత్సవం మంగళవారం సాయంత్రం ఆరున్నర గంటలకు నిర్వహించనున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.